## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



భవానీనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన తలాబ్ చంచలం డివిజన్‌లోని భవానీనగర్, చాచాగ్యారేజ్, నషేమన్‌నగర్, సిద్ది ఖీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. బస్తీలలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తమ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంత్రాల్లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షుడు, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హిందువులపై దాడులను ఖండించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గంగపుత్ర సంఘం నేతలు

గోల్కొండ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించాలని కార్వాన్ సబ్జిమండి గంగపుత్ర సంఘం అధ్యక్షులు విజయ్‌కిశోర్ అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శుక్రవారం కార్వాన్ సబ్జిమండిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్ ఏర్పడడానికి మన దేశమే కారణం అని అయితే ఆ దేశ ప్రజలతో పాటు దేశ నాయకులు బంగ్లాదేశ్‌లో హిందువులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.వేణుబాబు, శివరత్నం, నిరంజన్‌బాబు, ఆశోక్‌కుమార్, శ్రీనివాస్, గంగపుత్ర మహిళా సంఘం అధ్యక్షురాలు స్వాతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సహకార క్రెడిట్ విధానాలపై సదస్సు



నాబార్డ్ జాతీయ చైర్మన్ షాజీ కేవీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీందర్‌రావు

గన్‌ఫౌండ్రీ: స్వల్పకాలిక సహకార క్రెడిట్ విధానాలపై సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించి సదస్సుకు హాజరుకావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాబార్డ్ నిధుల వినియోగం తదితర విషయాలను తెలుసుకున్నామని వీటిని తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ డైరెక్టర్లు కె.వీందర్‌రావు, చిట్టి దేవేందర్‌రెడ్డి, కుంబం శ్రీనివాస్‌రెడ్డి, సీజీఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కోల్‌కతా ఘటన దేశానికే మాయని మచ్చ



నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

సుల్తాన్‌బజార్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార, హత్య ఘటనను నిరసిస్తూ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినిలు విశ్వ విద్యాలయంలోని దర్బార్ హాల్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. నిందితులను వెంటనే ఉరితీయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళా కళాశాల వీసీ ప్రొఫెసర్ విజ్ఞులత మాట్లాడుతూ కోల్‌కతా ఘటన దేశానికే మాయని మచ్చగా మిగిలిందన్నారు. హంతకులు ఎంతటి వారైనా పట్టుకుని బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలన్నారు.

## పాఠశాలకు కంప్యూటర్లు అందజేత



అబిడ్స్: పేద విద్యార్థులకు చేయూత నందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని, ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను ఆదుకోవడమే కాకుండా నూతన టెక్నాలజీతో కంప్యూటర్ విద్యను అందించి చేయూతనిస్తున్నామని యంగిస్తాన్ ఫౌండేషన్ వలంటీర్ ప్రతిపక్ష సాలియన్ అన్నారు. ఏవీఐ – ఎస్‌పీఎల్ కంపెనీ స్పాన్సర్ చేయగా యంగిస్తాన్ ఫౌండేషన్ ఎన్జీఓ కళ్యాణ్ ముంబై వ్యవస్థాపకులు మిథిలేష్ వాలంటీర్ ప్రత్యేక్ష సాలియన్, సామాజిక కార్యకర్త దవేరా మనోజ్‌కన్నాతో కలిసి శుక్రవారం అబిడ్స్ కట్టెల మండిలోని ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలకు రెండు కంప్యూటర్లను బహుకరించారు. అనంతరం దవేరా మనోజ్ కన్నా మాట్లాడుతూ.... సమాజంలో వెనుకబడిన వర్గాలను ఆదుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ప్రస్తుతం కంప్యూటర్ యుగం నడుస్తుందని పేద విద్యార్థులకు కంప్యూటర్ విజ్ఞానాన్ని అందించేందుకు పాఠశాలకు కంప్యూటర్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.హేమ, బి.మంజుల, ఎస్.సునిత, ఆర్.కవిత, ప్రియ, సంగీత, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులతో అవస్థలు

ప్రజలకు శాపంగా మారుతున్న అభివృద్ధి పనులు

- పైప్‌లైన్ కోసం తవ్విన గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



మోతీదర్వాజ వద్ద తవ్వి వదిలేసిన రోడ్డు

గోల్కొండ: అసంపూర్తి పనులు ప్రజలకు శాపంగా మారుతున్నాయి. కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది నుంచి నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో పైపులైన్ పనులు, వరద నీటి పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. అయితే వాటిలో నేటికి ఒకటి కూడా పూర్తి కాలేదు.

- ఎటు చూసినా అభివృద్ధి పనుల కోసం తవ్విన గుంతలే కనిపిస్తున్నాయి.
- మ్యాన్‌హోల్స్ మూతలు, డ్రైనేజీ పైపుల కోసం చేపట్టిన తవ్వకాల్లో ఇళ్ల నల్ల కనెక్షన్లు కూడా ధ్వంసమయ్యాయి
- పలు చోట్ల పైపులు వేయలేదు.
- మురికి నీరు గుంతల్లో నిండి దుర్గంధం వ్యాపిస్తుంది.
- నల్లా కనెక్షన్ పైపులు పగిలిపోవడంతో తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు
- టోలిచౌకీ చౌరస్తా, టూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో భారీ పైపులు వేయడానికి పెద్ద గుంత తవ్వి వదిలేశారు.



టోలిచౌకీ టూమ్స్ రోడ్డులో తవ్వకాలు

- గత వారం కురిసిన వర్షానికి ఈ గుంతలన్నీ వర్షం నీటితో నిండిపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- టోలిచౌకీ టూమ్స్ రోడ్డులోనూ రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వేశారు.
- తవ్వకాల కారణంగా ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.
- పైపులైన్ కోసం తవ్విన గుంతలో పడి మూడు నెలల క్రితం ఓ వ్యక్తి మృతి చెందాడు.
- అయినా అధికారుల్లో చలనం రాకపోవడం గమనార్హం. ఏడాదిగా టోలిచౌకీ చౌరస్తా నుంచి మోతీ దర్వాజా మీదుగా గోల్కొండ వెళ్లే వారు రోడ్డుపై గుంతల కారణంగా బంజారా దర్వాజ మీదుగా వెళ్లాల్సి వస్తోంది.
- ఈ కారణంగా గోల్కొండ బజారి దర్వాజా నిత్యం ట్రాఫిక్ జామ్ నెలకొంటోంది
- ప్రజాప్రతినిధులు కనీసం వారానికి ఒకటి రెండు సార్లు అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులను పనులు వేగవంతం చేయాలని సూచిస్తున్నారు.
- అయితే అధికారులు మాత్రం ఎవరి మాట వినిపించుకోవడం స్థానికులు పేర్కొంటున్నారు.
- ఒక పని పూర్తి కాక ముందే మరో పని కోసం వరుసగా రోడ్లను తవ్వుకుంటూ పోతున్నారు.



గోల్కొండ జిల్సి బజార్ రోడ్డులో..

పనులను వెంటనే పూర్తి చేయించి ఇబ్బందులను తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

## నేడు శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి కల్యాణ మహోత్సవం...

గౌలిపురా: శాలిబండ పోస్టాఫీస్ సమీపంలోని శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో ఈ నెల 24న ఉదయం 11 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. కల్యాణ మహోత్సవంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## నేటి నుంచి విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి ఉత్సవాలు

సుల్తాన్‌బజార్: విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా షష్టిపూర్తి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షులు నర్సింహమూర్తి, రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1964లో శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున ముంబై సమీపంలోని సందీపని ఆశ్రమంలో విశ్వహిందూ పరిషత్‌ను స్థాపించినట్లు తెలిపారు. తమ సంఘం ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని, చరిత్రలో నిలిచిపోయే అయోధ్య వంటి భారీ ఉద్యమాలు చేపట్టి విజయం సాధించిందన్నారు. ఆరు దశాబ్దాలుగా హిందూ సమాజ హితం కోసం పనిచేస్తుందన్నారు. ఈ నెల 24 నుంచి సెప్టెంబర్ 1 తేదీ వరకు వారం రోజుల పాటు విశ్వహిందూ పరిషత్ షష్టిపూర్తి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

## రోడ్ల మరమ్మతులు చేపట్టండి

అబిడ్స్: గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అబిడ్స్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గణేష్ మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో, ధూల్‌పేట్ నుంచి ఇతర ప్రాంతాలకు గణేష్ విగ్రహాలను తీసుకువెళ్లే ప్రాంతాల్లో రోడ్లు మరమ్మతులు చేయాలన్నారు. పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ వెంటనే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

## బీఆర్ఎస్ నేతలు అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్నారు

అఫ్జల్‌గంజ్: ఇందిరమ్మ రాజ్యంలో బడుగు బలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని బీఆర్ఎస్ అగ్రనాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..... అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ తట్టుకోలేకపోతుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలోనే టీ న్యూస్ కార్యాలయాన్ని నడుపుతూ కాంగ్రెస్ పార్టీపై విషం చిమ్మడం సరికాదన్నారు.



గౌరీ సతీష్

జర్నలిస్టు తీన్మార్ మల్లన్న, రఘులతో పాటు పలువురిపై బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించి జర్నలిస్టులను వేధించారన్నారు. జర్నలిస్టులకు సంక్షేమం, సౌకర్యాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కలిస్తుందన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టుల గొంతు నొక్కి వారిపై కేసులు నమోదు చేసిందన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు తమ గతాన్ని ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు.

## శాంతియుతంగా వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి

సంతోష్‌నగర్: ఆధ్యాత్మిక, శాంతియుత వాతావరణంలో ప్రజలు వినాయక నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఐఎస్‌సదన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య అన్నారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్టేషన్ పరిధిలో మండపాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, ఉత్సవాల నిర్వాహకుల తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఐ ఎన్.సైదయ్య, ఎస్సైలు ఎస్.బ్రహ్మాచారి, డి.విజయ కుమార్, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎస్‌సదన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామయ్య

## అప్పులు ఇస్తూ.. అధికంగా వసూలు చేస్తూ

- ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలపై 43 ఎఫ్ఐఆర్‌లు నమోదు
- అప్పులు తీర్చలేక ప్రాణాలు తీసుకుంటున్న జనం
- విచారణ చేపట్టిన ఈడీ అధికారులు

సిటీ కోర్టులు : తక్షణ రుణం పేరుతో అప్పులు ఇస్తూ ఆపై వసూళ్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న పలు కంపెనీలపై ఈడీ (డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) చర్యలు చేపట్టింది. దీంతో ఆయా కంపెనీలపై మనీ లాండరింగ్ యాక్ట్ 2002 ప్రకారం పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీని ఆధారంగా ఈడీ (హైదరాబాద్ జోనల్ కార్యాలయం) అధికారులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో శుక్రవారం నాంపల్లి స్పెషల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 2020–21 సంవత్సరంలో పలు (ఎన్‌బీఎఫ్‌సీ)నాన్–బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, ఫిన్‌టెక్ కంపెనీలు, వివిధ మొబైల్ అప్లికేషన్ల ద్వారా తక్షణ రుణం ఇచ్చే వ్యాపార కంపెనీలు, వ్యక్తిగతంగా రుణం ఇస్తూ వ్యాపారం చేస్తున్న వారిపై సైబర్‌క్రైమ్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో 43 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు ఈడీ వెల్లడించింది. ఈ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగానే దర్యాప్తు చేపట్టామన్నారు. రుణం మొబైల్ యాప్స్ ద్వారా రుణం మంజూరు చేసి తర్వాత అధికా వడ్డీలతో వేధింపులకు పాల్పడుతుండటంతో అప్పు తీసుకున్న వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఈ రుణాలకు సంబంధించి ఈడీ విచారణలో ఆయా కంపెనీల ఆస్తులను అటాచ్ చేయగా ఫిన్‌టెక్ కంపెనీ, ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీలో రూ.346.86 కోట్లు ఉన్నట్లు తేలిందని, మరింత లోతుగా విచారణ చేపడితే దాదాపు రూ. 434 కోట్లు వారి బ్యాంక్ ఖాతాలో నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుతుందన్నారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టి త్వరలోనే అన్ని వివరాలు కోర్టు ముందు ఉంచుతామని ఈడీ వివరించింది. త్వరలోనే నాంపల్లి కోర్టు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టే అవకాశం ఉంది.

## అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వి.అరుణ్, ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రాముఖర్జీ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా నాంపల్లి మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అభ్యాసకుల సహాయ కేంద్రం–26 పనిచేస్తోందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సహాయ కేంద్రం ద్వారా ప్రవేశాలను పొందవచ్చని తెలిపారు. టెన్త్, ఇంటర్ తత్సమానమైన కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారు ఇందుకు అర్హులన్నారు. ఈ నెల 31 లోగా ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇతర వివరాల కోసం 7382929626 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## బడాబాబులకే మోదీ వరాలు

గోల్కొండ: దేశంలోని బడా పారిశ్రామికవేత్తల అక్రమాలకు ప్రధాని మోదీ వత్తాసు పలుకుతున్నారని కాంగ్రెస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ అల్ హాజరీ అన్నారు. శుక్రవారం కార్వాన్‌లో ఆయన ఆధ్వర్యంలో బీజేపీ విధానాలకు వ్యతిరేఖంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి అదానీ, అంబానీ లాంటి వారికి అండగా ఉంటున్నారన్నారు. ప్రజలు ప్రభుత్వానికి కనీసం రూ.10 కూడా ట్యాక్స్ కూడా కట్టలేని స్థితిలో ఉన్నారని అయితే ప్రధాని నరేంద్రమోదీ తన కనుసన్నల్లో మెలిగే బడా పారిశ్రామికవేత్తలకు రుణమాఫీ చేస్తున్నారన్నారు. దేశంలోని పేరెన్నికగన్న ప్రభుత్వ రంగ సంస్థలను ఒకొక్కటిగా మోదీ బడా పారిశ్రామికవేత్తలకు బహుమతిగా ఇస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, చంటి బాబు తదితరులున్నారు.

## శుభాకాంక్షలు

నాంపల్లి: ఎమ్మెల్సీ ఆమేర్ అలీ ఖాన్‌ను పలువురు ముస్లిం మైనార్టీ ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ నేతృత్వంలో ఆమేర్ అలీ ఖాన్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు మహ్మద్ ఐజాజ్ ఉజ్ జమా, మహ్మద్ అబ్దుల్ అజీమ్, సాజిద్‌బిన్ అబ్దుల్ అజీజ్, అబ్దుల్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారి పల్లకి సేవ



స్వామివారి చక్రస్నానం

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ హనుమాన్ బాలాజీ మందిరం 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 19న ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం మహా పూర్ణాహుతి, శ్రీవారికి చక్రస్నానంతో ముగిశాయి. గురువారం రాత్రి శ్రీ వేంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి సహిత పల్లకి సేవా దాయిబాగ్ నుంచి ప్రారంభమై ఆసిఫ్‌నగర్ లక్కి హోటల్, రాయల్సి చౌరస్తా, శంకర్‌నగర్ భవాని సహిత శంకర ఆలయం పురవీధుల మీదుగా కొనసాగింది. మహిళల కోలాటాలు, నృత్యాలు, మంగళ వాయిద్యాలతో సందడి నెలకొంది. తమ ఇంటిముందుకు వచ్చిన స్వామివారి పల్లకికి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు పి.సత్యంచారి, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షులు గౌరిగే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుదర్శన, కార్యదర్శి బి.రమేష్, డి.శ్రీనివాస్, సామల శ్రీనివాస్, డబ్ల్యూ.పవన్, కె.రాంచందర్, అశోక్, గౌరిగే యాదయ్య శీలం బాలచందర్, సీహెచ్ లక్ష్మీనారాయణ, పి.అంజయ్య యాదవ్, రేణేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గోల్కొండ: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించడంతో పాటు పలు మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కెట్ యార్డ్ ఫీడర్ పరిధిలోని దిలాషాద్‌నగర్, అయోధ్యనగర్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, అరవింద్ ఐ హాస్పిటల్, సంతోష్‌నగర్, మిలాన్ గార్డెన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది.

### ఫలక్‌నుమా సబ్‌స్టేషన్ పరిధిలో..

ఫలక్‌నుమా సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు బస్తీల్లో విడుతల వారిగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు బాలాపూర్, కుమ్మర్‌వాడీ, ఉమర్ కాలనీ, భారత్ కోట, బార్కాస్, బాయ్స్ టౌన్, షమా టాకీస్, జహనుమా, నవాబ్ సాహెబ్ కుంట ప్రాంతాలు, 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాబా నగర్ సి బ్లాక్, ముస్తఫా నగర్, ఓవైసీ హిల్స్, అచిరెడ్డి నగర్, మహ్మదీయ కాలనీల్లో అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1.30 నుంచి 3 వరకు బిలాల్ నగర్, అంజదుల్లా బాగ్, గౌస్‌నగర్, హసన్‌నగర్, ఫూల్‌బాగ్, కందికల్ గేట్, జీఎం కాలనీ, తాళ్ల కుంట, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు తీగలకుంట, రహ్మత్‌పురా, బాబా నగర్ ఎ బ్లాక్, ఖాన్ నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

### ఆగాపురా, గోషామహల్ విద్యుత్ ఫీడర్ల పరిధిలో..

గన్‌ఫౌండ్రీ: 11 కేవీ ఆగాపురా, గోషామహల్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని ఆగాపురా నాలా, ఫటాఫట్ గల్లీ, గౌస్‌పురా, బోయిగూడ, ఏసీపీ కార్యాలయం, శ్మశాన వాటిక, గంజషా దర్గా తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుండి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 11 కేవీ కిషన్‌నగర్ ఫీడర్ పరిధిలోని హుడా కాలనీ, జిర్రారోడ్డు, గంజషా దర్గా తదితర ప్రాంతాల్లో 11.30 గంటల నుండి 12.30 గంటల వరకు, సమర్థ నారాయణ, భేగంబజార్, తాళ్లగడ్డ ఓవర్ హెడ్ ఫీడర్ల పరిధిలోని సమర్థ నారాయణ ఆశ్రమం, సంజయ్‌నగర్, ఎంసీహెచ్ క్వార్టర్స్, భేగంబజార్ ఛత్రి, సెవెన్ హైవన్ హోటల్, కంటి ఆసుపత్రి, ఆర్యసమాజ్, మల్లన్న దేవాలయం తదితర ప్రాంతాలలో 1.30 నుండి 3 గంటల వరకు, 11 కేవీ రాంసింగ్ పురా ఫీడర్ పరిధిలోని సనా హోటల్, ఆర్యసమాజ్, ఎంసీహెచ్ కార్యాలయం, తాళ్లగడ్డ తదితర ప్రాంతాలలో 3 నుండి 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా విష్ణు నారాయణ్ బత్కాండే జయంతి



విష్ణు నారాయణ్ బత్కాండే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంగీత నృత్యకళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ్ ముత్తాలిక్

సుల్తాన్‌బజార్: విష్ణు నారాయణ్ బత్కాండే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లాంగ్వేజ్ అండ్ కల్చర్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాంకోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ్ ముతాలిక్ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల లెక్చరర్ శ్వేత హిందుస్థానీ ఓకల్ కచేరి ప్రేక్షకులను అలరించింది. కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ్ ముత్తాలిక్ సితార్ వాయించి శిష్యబృందానికి ప్రేరణగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి, మాజీ సితార్ అధ్యాపకులు, నిజామాబాద్ మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.రవీందర్‌రాజులను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ పాండురంగ్ ముత్తాలిక్ మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం సంగీతాన్ని సాహిత్యాలను ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సంగీత నృత్య కళాశాలలో ప్రముఖ సంగీత విద్వాంసులను గుర్తు చేసుకుంటూ వారి జయంతిలను ఘనంగా నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో టి.జయకిషన్, రవీందర్ రాజు, గుమ్మడి జనార్దన్‌లతో పాటు సంగీత అధ్యాపకులు వారి శిష్య బృందం పాల్గొన్నారు.